క్లుప్తంగా

ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా పరిశీలించాలి

పెదపూడి: ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబిత పరిశీలించి సవరణ, మార్పులు, చేర్పులు బాధ్యతగా చేపట్టాలని తహసీల్దార్ టి.సుభాష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోలకు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు అందరూ తప్పనిసరిగా ఇంటింటి సర్వే చేపట్టి ఓటర్ల జాబితా సవరించాలని చెప్పారు. ఓటరు ఫొటో, చిరునామా, పేర్ల మార్పులపై 6ఏ, 7ఏ, 8ఏ దరఖాస్తులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామ్‌కుమార్, ఆర్‌ఐ త్రివేణి, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

జోరు వాన

మధురపూడి: కోరుకొండ మండలంలో బుధవారం జోరుగా వర్షం పడింది. దీంతో పాటు ఈదురుగాలులు వీచాయి. పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం కారణంగా ఇళ్లలో నుంచి ఎవరూ బయటకు రాలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చిన వాహనచోదకులు, స్థానికులు ఇబ్బంది పడ్డారు. దీనికితోడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొన్నారు. కణుపూరు, గాదరాడ, కోటికేశవరం, బొల్లెద్దుపాలెం, గరగలం పాలెం గ్రామాల్లో వర్షపు నీరు రోడ్లపైకి చేరింది.

అతివలకు వరం మహిళా సమ్మాన్ పథకం



ముకుందవరంలో పోస్టల్ పథకాలను గ్రామస్తులకు వివరిస్తున్న కోమల్‌కుమార్

రంగంపేట: మహిళా సమ్మాన్ పొదుపు పథకం మహిళలకు వరం లాంటిదని, అందరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ పి.కోమల్‌కుమార్ సూచించారు. మండల పరిధిలోని ముకుందవరం బ్రాంచి పోస్టాఫీసును బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన తపాలా సిబ్బందితో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పోస్టల్ పొదుపు పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం వెస్ట్ సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎస్‌సీహెచ్‌వీ రాజేష్, స్థానిక బ్రాంచి పోస్ట్ మాస్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గురై ఆంబోతు మృతి

గోకవరం: అచ్యుతాపురం గ్రామంలో విద్యుదాఘాతానికి గురై బుధవారం ఆంబోతు మృతి చెందింది. వివరాల ప్రకారం.. గ్రామంలో ఆంబోతు ఉదయం బయట సంచరిస్తుండగా విద్యుత్ స్తంభానికి తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గత రెండు రోజులుగా గ్రామంలో వర్షం కురుస్తుండడంతో విద్యుత్ స్తంభానికి విద్యుత్ సరఫరా అయ్యి ఆంబోతు మృతి చెందిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ సంఘటనతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.

వ్యక్తికి జైలు శిక్ష

రంగంపేట: నిర్లక్ష్యంగా బస్సు నడిపి ఒక వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌కు జైలు శిక్ష పడినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 2011లో ప్రైవేటు బస్సు డ్రైవర్ జొన్నాడ శ్రీనివాసరావు నిర్లక్ష్యంగా వాహనం నడిపి రంగంపేట మండలం వడిశలేరు వద్ద చెట్టును ఢీకొట్టాడు. ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఆత్మూరి లక్ష్మణరావు మృతి చెందాడు. దీనిపై అప్పట్లో రంగంపేట పోలీసులు కేసు నమోదు చేయడంతో 2016లో పెద్దాపురం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ డ్రైవర్ శ్రీనివాసరావుకు పలు సెక్షన్ల కింద ఏడాది, ఆరు నెలలు, మూడు నెలలు జైలు శిక్ష విధించారు. దీనిపై నిందితుడు శ్రీనివాసరావు అప్పీలు చేసుకోగా బుధవారం పెద్దాపురం ఏడో జిల్లా కోర్టు మెజిస్ట్రేట్ నికిత కింది కోర్టు తీర్పును సమర్థిస్తూ జైలు శిక్ష ఖరారు చేశారని తెలిపారు.

'నన్నయ' విద్యార్థుల ఆందోళన

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో వీసీ చాంబర్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో హాస్టల్ విద్యార్థులు ఆందోళనకు దిగారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు 75 శాతం కాషన్ డిపాజిట్‌ను తిరిగి చెల్లించక పోవడంతో వీసీ ఆచార్య కె.పద్మరాజుతో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకూ దఫదఫాలుగా చర్చలు జరిపారు. ఈ చర్చలలో సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో రాత్రి 8.30 గంటలకు ఆందోళన దిగాల్సి వచ్చిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజారత్నకుమార్, ఉపాధ్యక్షుడు డి.అశోక్‌కుమార్, గంగిరెడ్డి ప్రవల్లిక తదితరులు తెలిపారు. సమస్య పరిష్కరించే వరకూ ఆందోళన కొనసాగుతుందన్నారు. ఎస్.శ్రావణి, పి.జ్యోతి, ఎస్.పల్లవి, తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ విషయమై వీసీ ఆచార్య పద్మరాజును ఫోన్‌లో వివరణ కోరగా విద్యార్థుల సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నామన్నారు.

బైక్ ర్యాలీ

మధురపూడి: కోరుకొండలో లక్ష్మీనరసింహ స్వామిని జనసేన రాజానగరం ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ బుధవారం దర్శించుకున్నారు. తొలుత గాదరాడ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. కాపవరం పార్టీ కార్యాయంలో సమావేశం నిర్వహించారు.

సాగు.. మరింత జాగు

- తగ్గిన బెంగాలీ కూలీలు
- స్థానికులకు పెరిగిన డిమాండ్
- మెట్టలో 40 శాతమే వరి నాట్లు



వరి నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

రాజానగరం: మునుపెన్నడూ లేని విధంగా మెట్ట ప్రాంతంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు అన్నదాతలకు చుక్కలు చూపిస్తోంది. సాధారణంగా సీజన్ ఏదైనా ముందంజలో ఉండే మెట్ట ప్రాంత రైతులు ఈ సీజన్‌లో ఏర్పడిన ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా వెనుకబడిపోయారు. ఏటా జూలై నెలాఖరు నాటికి 90 శాతం పైబడి వరి నాట్లు పూర్తయ్యేవి. ఈసారి 40 శాతం కూడా పూర్తి కాలేదంటే ఈ ప్రాంతంలో వాతావరణ ప్రతికూల పరిస్థితులు వరి సాగు పై ఏమేరకు ప్రభావం చూపాయో అర్థం చేసుకోవచ్చు.

గొట్టపు బావులున్నచోటే..

సరైన సాగునీటి సౌకర్యాలు లేని మెట్ట ప్రాంతంలో అధిక శాతం మంది రైతులు గొట్టపు బావుల సాయంతోనే వ్యవసాయం చేస్తుంటారు. అయితే ఈసారి సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్ వరి సాగు రైతులకు కష్టమైంది. గొట్టపు బావుల సదుపాయం ఉన్న ప్రాంతాలలో రైతులు వరి నార్లు వేసి, నాట్లు వేయడంలో రైతులు ముందంజలో ఉన్నారు. ముఖ్యంగా రాజానగరం మండలం నరేంద్రపురం, కలవచర్ల, తూర్పుగానుగూడెం, వెలుగుబందలలో వరి నాట్లు వేయడంలో రైతులు ముందున్నారు. మిగిలినచోట్ల నార్లు వేయడంలో రైతులు వెనుకబడ్డారు. పది రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో తడిసిన పొలాలను దుక్కులు చేసి, నారు వేసే పనిలో పడ్డారు. మరికొంతమంది నారు కొనుగోలు చేసి, దుక్కులు చేసిన పొలాలలో నాట్లు వేస్తున్నారు. ఈ తరుణంలో చాగల్నాడు, పుష్కర, వంటి ఎత్తిపోతల పథకాల ద్వారా కూడా గోదావరి నీటిని విడుదల చేయడంతో పూర్తి స్థాయిలో వ్యవసాయ పనులు చేపట్టడానికి అవకాశం ఏర్పడింది.

స్థానికులకు పెరిగిన డిమాండ్

గత ఐదారు సంవత్సరాలుగా వరి నాట్లు వేయడంలో స్థానికంగా ఎదురవుతున్న కూలీల కొరతను బెంగాలీ కూలీలు చాలావరకు తీరుస్తున్నారు. అయితే ఈసారి వారి రాక చాలావరకు తగ్గిపోయింది. బెంగాల్‌లో ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో చాలామంది వారి స్వస్థలాలలోనే ఉండిపోయారు. దీంతో ఏటా 1,000 నుంచి 1,500 మంది వరకు వచ్చే బెంగాలీలు ఈసారి 1,000 లోపునే ఉన్నారు. దీనితో స్థానిక కూలీలకు డిమాండ్ పెరిగింది. రోజుకు ఆడ వారికి రూ. 400, మగవారికి రూ. 600 కూలీ చెల్లించవలసి వస్తోందని రైతులు తెలిపారు. అంతేకాక బెంగాలీ కూలీలు కూడా నారు తీసి, నాట్లు వేసేందుకు ఎకరాకు తీసుకునే కిరాయి రూ.3,200 నుంచి రూ.4,000కు పెంచేశారు. బెంగాలీ కూలీల వరి నాట్లు వేసే విధానం ఒక క్రమపద్ధతిలో ఉంటూ, దిగుబడులు పెరగడానికి తోడ్పడుతుంటుంది. దీనితో ఆలస్యమైనా వారితోనే నాట్లు వేయించేందుకు కొంతమంది రైతులు వేచిచూస్తున్నారు.

మండలాల వారీగా వరి నాట్లు ఇలా..

రాజానగరం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 16,698 హెక్టార్ల సాగు విస్తీర్ణం ఉండగా ఇప్పటి వరకు 6,679 హెక్టార్లలోనే వరి నాట్లు వేశారు. మిగిలినచోట్ల పొలాల దుక్కులు చేయడం, వరి నారు సిద్ధం చేసుకొనే పనిలో రైతులు ఉన్నారు. మండలాల వారీగా పరిశీలిస్తే రాజానగరంలో 4,983 హెక్టార్లకు 2,250 హెక్టార్లు, కోరుకొండలో 6,046 హెక్టార్లకు 665 హెక్టార్లు, సీతానగరంలో 5,669 హెక్టార్లకు 3,764 హెక్టార్లలో వరి నాట్లు వేశారు.

వాతావరణం అనుకూలించక ఆలస్యం



మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్ సాగులో రైతులు ముందుండేవారు. అయితే ఈ సంవత్సరం వాతావరణం అనుకూలించకపోవడంతో వర్షాలు ఆలస్యంగా కురిశాయి. బోర్ల సదుపాయమున్న చోట్ల తప్ప, మిగిలిన ప్రాంతాల్లో నెలరోజులు వరి సాగు ఆలస్యమైంది.

– బాసా సత్యనారాయణ, రైతు, గాడాల

వ్యవసాయ శాఖ సూచనలివ్వాలి



వ్యవసాయ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో రైతులకు సూచనలు ఇవ్వాలి. సాగు ఆలస్యంగా మొదలయిన నేపథ్యంలో రైతన్నలకు అవసరమైన సహకారాన్ని అందించాలి. సీజన్ ఆలస్యం కావడంతో పంటకు తెగుళ్లు సోకే అవకాశం ఉన్నందున నివారణ చర్యలు తీసుకోవాలి.

– సూరిశెట్టి అప్పలస్వామి, రైతు, శ్రీరంగపట్నం

సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలి

పెదపూడి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సచివాలయ అధికారులు, వలంటీర్లు అర్హులందరికీ అందేలా చూడాలని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ అధికారులతో ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలు తెలిపే ప్రదర్శన బోర్డులు సచివాలయాల బయట ఏర్పాటుచేయాలని సూచించారు. వర్షాకాలం కారణంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య చర్యలు మరింత మెరుగుపరచాలన్నారు. ఆరోగ్యశాఖ, సచివాలయాల సిబ్బంది సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ఉప సర్పంచ్‌కు గాయాలు



చికిత్స పొందుతున్న శ్రీనును పరామర్శిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: స్థానికంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో కోరుకొండ పంచాయతీ ఉప సర్పంచ్ నేతుల చిన్నికి బుధవారం గాయాలయ్యాయి. ఈ మేరకు రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతనిని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శించారు. కోరుకొండ నుంచి కాతేరుకు బైక్‌పై వెళ్తుండగా మధురపూడి వద్ద మలుపులో మరో మోటార్ సైకిలిస్టు ఢీకొట్టాడు. చిన్నిని విజయలక్ష్మి పరామర్శించి ఆరోగ్యం గురించి వైద్యులతో మాట్లాడారు. ఎటువంటి ఇబ్బంది లేదని వైద్యులు వివరించారు.

దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలి

రాజానగరం: దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించేలా భావిభారత పౌరులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కల్నల్ అరుణ్‌కాంత్ రుషి అన్నారు. నామవరంలోని భారతీయ విద్యా భవన్‌లో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తొలుత కార్గిల్ యుద్ధంలో అమరులకు నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ వీరేంద్రనాథ్ పాల్గొన్నారు.

గడప గడపకూ గర్వంగా తిరుగుతున్నాం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కొంకుదురులో రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం



కొంకుదురులో సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో గడప గడపకూ గర్వంగా తిరుగుతున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. కొంకుదురు గ్రామంలో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి సంబంధిత కరపత్రాలను అందజేశారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్న పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. ఏ గడపకు వెళ్లినా ప్రజలు చిరునవ్వుతో తమని ఆహ్వానిస్తున్నారని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. అందరికీ మంచి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లోనూ ప్రజలు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కొంకుదురు పీవీ, నల్లమిల్లి అమ్మిరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు

వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ గణేష్



కాటవరంలో పథకాల గురించి వివరిస్తున్న జక్కంపూడి గణేష్

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ అందిస్తున్నామని ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. బుధవారం కాటవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లివెసంక్షేమ పథకాల గురించి వివరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత టీడీపీ హయాంలో పేదలకు ఒక్క ఇంటి స్థలం కూడా ఇవ్వలేదని, ప్రస్తుతం సీఎం జగన్ మోహన్‌రెడ్డి 33 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలను అందించి చరిత్ర సృష్టించారన్నారు. పాదయాత్రలో ప్రజల కష్టాలను, సమస్యలను తెలుసుకుని నవరత్నాల పథకాలతో ప్రజలను సీఎం ఆదుకుంటున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ఆశీర్వదించాలని గణేష్ కోరారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, నియోజకవర్గ బూత్ కమిటీల చైర్మన్ గద్దె వెంకట కృష్ణచౌదరి, ఉప సర్పంచ్ కోన రామకృష్ణ, ఎంపీటీసీ తాడిపల్లి వెంకట్రావు, నాయకులు చిట్టూరి వెంకట రామారావు పాల్గొన్నారు

నియోజకవర్గాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చుతా..

ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రాజా



టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: టి.టి.డి. సహకారంతో నియోజకవర్గాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. తిరుమలలోని శ్రీవేంకటేశ్వర స్వామివారిని ఆయన బుధవారం దర్శించుకున్నారు. అనంతరం పాలకమండలి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరెడ్డిని కలుసుకున్నారు. టీటీడీ అమలు చేస్తున్న శ్రీవాణి పథకంలో భాగంగా మంజూరు చేసిన నిధులతో నవ నారసింహ క్షేత్రాలలో ఒకటైన కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.90 లక్షలతో ఐదు అంతస్తుల రాజగోపురం, రూ.1.35 కోట్లతో కల్యాణ మండపం, కొండపైకి రూ.3.75 కోట్లతో నిర్మించనున్న రిటైనింగ్ వాల్, ప్రాకార మండపం, రూ.33.75 లక్షలతో మెట్ల మార్గం అభివృద్ధి, రూ.28 లక్షలతో గోశాల, రూ.42 లక్షలతో అన్నదాన భవనం పునర్నిర్మాణ పనులు జరుగనున్నాయి. రూ.1.25 కోట్లతో రంగనాథస్వామి ఆలయాన్ని కూడా పునర్నిర్మించాల్సి ఉందని, సత్వరమే ఈ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని చైర్మన్ సుబ్బారెడ్డిని ఎమ్మెల్యే కోరారు. సీతానగరం మండలం చినకొండేపూడిలో రూ.1.30 కోట్లతో టీటీడీ కల్యాణ మండపం, రూ.60 లక్షలతో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణాల గురించి కూడా ప్రస్తావించారు. రూ.1.90 కోట్లతో రాజమహేంద్రవరం గోదావరి తీరాన ఉన్న అయ్యప్పస్వామి ఆలయం అభివృద్ధి పనులు, వెలుగుబందలోని నెలకొల్పదలచిన ఆంజనేయస్వామి భారీ విగ్రహం గురించి మాట్లాడారు. సాధ్యమైనంత త్వరగా ఈ పనులన్నింటినీ చేపట్టేలా చర్యలు తీసుకుంటామని చైర్మన్ సుబ్బారెడ్డి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరెడ్డిని కూడా ఇదే విషయాలపై కలుసుకుని, త్వరగా పనుల ప్రారంభించేలా చూడాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారన్నారు.

తిరుమలేశుని సన్నిధిలో ఎమ్మెల్యే రాజా

తిరుమల వేంకటేశ్వర స్వామివారిని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరికీ తిరుమలేశుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఆయురారోగ్యాలతో పాటు అభివృద్ధిని ప్రసాదించాలని కోరానని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని, 2019లో కంటే అత్యధిక మెజార్టీతో నియోజకవర్గంలో విజయం సాధించేలా ఆశీస్సులు అందించాలని కలియుగ దైవాన్ని వేడుకున్నారు.

తోకాడ విద్యార్థుల ప్రాజెక్టుకు గుర్తింపు



రూపొందించిన ప్రాజెక్టుతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

రాజానగరం: రైల్వే ప్లాట్‌ఫారమ్ నుంచి కదిలే రైలును ఎక్కే సమయంలో చాలామంది ప్రమాదాలకు గురవుతుంటారు. ఇటువంటి ప్రమాదాల నివారణకు ఇద్దరు విద్యార్థినులు చేసిన ప్రాజెక్టు జాతీయ స్థాయిలో రెండో స్థానం దక్కించుకుంది. ఇటీవల జాతీయ స్థాయిలో 'జీవైఎస్ ఆవిష్కార్ 2023' పేరిట శాస్త్రీయ ఆవిష్కరణల పోటీలు నిర్వహించారు. ఇందులో రాజానగరం మండలం తోకాడకు చెందిన 10వ తరగతి విద్యార్థినులు వనుము అక్షయ, ఎం.సుప్రియలు ప్రదర్శించిన ఈ ప్రాజెక్టుకు ద్వితీయ స్థానం లభించింది. అఖిల భారతీయ సంత్ మత్ సత్సంగ్ (ఢిల్లీ) ఆధ్వర్యంలో తోకాడలో నిర్వహిస్తున్న 'యశ్ రూప్ జీ' స్కూల్‌లో ఈ విద్యార్థినులు చదువుతున్నారు. ఎరుపు రంగు సిగ్నల్‌కి రైలు ఆగి, పసుపు రంగు సిగ్నల్‌తో కదిలి, ఆకుపచ్చ రంగు సిగ్నల్‌తో ముందుకు వెళ్తుంది. రైలులో ప్రయాణిస్తున్న కొంతమంది ఆ సిగ్నల్స్‌ను పసికట్టలేక రైలు కదులుతుంటే పరుగు పెట్టి ఎక్కేందుకు ప్రయత్నిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆకుపచ్చ సిగ్నల్ రైలు నడిపే వ్యక్తితో పాటు ప్లాట్‌ఫారమ్ ఉన్న వారందరికీ కనిపించేలా ఆ ప్లాట్‌ఫారమ్ అంతా అదే రంగులోకి మారేలా లైటింగ్ ఏర్పాటు చేయడమే తమ ప్రాజెక్టు అని ఆ విద్యార్థినులు వివరించారు. ఉపాధ్యాయులు ఎ.స్వాతి, జె.నాగేశ్వరరావుల సలహాల మేరకు ఈ ప్రాజెక్టును రూపొందించామన్నారు. జాతీయ స్థాయిలో రెండో స్థానంలో నిలిచిన ఈ ప్రాజెక్టుకు ఆగస్టు 5న జరిగే కార్యక్రమంలో నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్ అందించనున్నారు. విద్యార్థినులను, ప్రోత్సహించిన ఉపాధ్యాయులను స్కూల్ యాజమాన్యం అభినందించింది.

దొండ రైతు దిగాలు

- కిలో రూ.3 మాత్రమే
- ఒక్కసారిగా తగ్గిన ధర



సీతానగరం లంక భూమిలో దొండపాదులు

సీతానగరం: దొండకాయల ధర అమాంతం పడిపోయింది.. దిగుబడులు బాగున్నాయని సంబరపడే లోపే ధర రైతులను నష్టాల పాల్జేసింది. దళారుల చేతుల్లో కూరగాయల రైతులు చిక్కుకుని విలవిలలాడుతున్నారు. కిలో రూ.మూడుకు కొనుగోలు చేసి, దుకాణాల్లో మాత్రం రూ.15 నుంచి రూ.20కు విక్రయిస్తూ పుడమిపుత్రులను నిండా ముంచుతున్నారు. సీతానగరం మండలంలో సుమారు 450 ఎకరాలలో దొండ సాగు చేస్తున్నారు. వంగలపూడి, రామచంద్రపురం, పురుషోత్తపట్నం, సీతానగరం, చినకొండేపూడి, రఘుదేవపురంలలోని లంక, గరువు భూములలో సాగు జరుగుతోంది. ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకూ శిస్తు చెల్లించి దొండ పాదులు పెట్టారు. వాతావరణం అనుకూలించడంతో మంచి దిగుబడి వచ్చింది. ధర బాగుంటుందని రైతులు ఆశించారు. పది కిలోల దొండకాయలు రూ.200 వరకూ ఉండే ధర ఒక్కసారిగా పది కిలోలు రూ.30కు పడిపోయింది. దీంతో రైతులు దిగాలు చెందుతున్నారు. దొండ విత్తనాలకు, పందిరి కర్రలకు, వైర్లు, పాదుల పెంపకం పెట్టుబడి, కోత కూలీలు, ఎరువులు, పురుగు మందులకు కలపి ఎకరానికి రూ.2 లక్షల ఖర్చు అవుతుంది. దొండ పాదులు రెండేళ్ల వరకూ ఉంటాయి. మొదటి ఏడాది పెట్టుబడి ఎక్కువ అవుతుంది. రెండో ఏడాది పందిళ్లు, కర్రలు వంటివి అవసరం లేనందున పెట్టుబడి తగ్గుతుంది. పాదులు పెట్టిన రెండు నెలల నుంచి దొండకాయలు కాపులోకి వస్తాయి. ఏడాదిలో ఎకరానికి 40 టన్నుల నుంచి 50 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం కిలో దొండ రూ.3 పలకడంతో నష్టాలు వస్తున్నాయని రైతులు అంటున్నారు. కోసే కూలీలకు కూడా డబ్బులు రావడం లేదని వాపోతున్నారు. నిల్వ ఉంచి అమ్మకాలు జరపడానికి వీలులేని పరిస్థితి. ప్రతి వారం కోయాల్సిన దొండ కాయలను పది రోజుల దాటిన అనంతరం కోతలు జరిపి, వాటిని అమ్మినా కోత కూలీ రాని పరిస్థితి ఏర్పడిందని రైతులు కంటతడి పెడుతున్నారు. తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

దళారుల వల్ల ధర పతనం



ఎకరంన్నర పంట భూమిలో దొండపాదులు పెట్టాను. రూ.రెండు లక్షల వరకూ పెట్టుబడి పెట్టాను. కిలో ధర రూ.3 మాత్రమే ఉంది. దళారుల వల్ల ధర పడిపోయింది. దీంతో నష్టాలు చూస్తున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

– మట్ట శ్రీనివాస్, రైతు, సింగవరం

కౌలు సొమ్ము రాదు



ఎకరం దొండపాదులు పెట్టాను. కిలో దొండ రూ.3కు కొనుగోలు చేస్తున్నారు. కౌలు డబ్బులు కూడా రాని పరిస్థితి నెలకొంది. పెట్టుబడి రూ.2 లక్షలు అయింది. అంతా నష్టమే. బయట వ్యాపారులు మాత్రం కిలో దొండ కాయలు రూ.15 నుంచి రూ.20కు అమ్ముతున్నారు. – తోరం శోభన్‌బాబు, కౌలు రైతు, లంకూరు

అర గంటలో ఆరోగ్యశ్రీ కార్డు

పలుకుల్లో వందనం




శిశువును ఎత్తుకుని లాలిస్తున్న వలంటీర్ బి.సత్యవతి

అనపర్తి: ఈ ఫొటోలోని నవజాత శిశువును లాలిస్తున్న ఆమె ఆ బాలింతకు బంధువు కాదు...ఆ శిశువుకు చుట్టం అంతకన్నా కాదు.. ఏ బంధుత్వమూ లేని వారి మధ్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఓ వ్యవస్థ విడదీయలేని అనుబంధాన్ని ఏర్పరిచింది. అదే గ్రామ వలంటీర్ వ్యవస్థ.

పెద్దాపురం మండలం కట్టమూరుకు చెందిన రొంగల కనకలక్ష్మి కాన్పు నిమిత్తం పుట్టిల్లు కొప్పవరం వచ్చింది. ఈ క్రమంలో ఈ నెల 3న వైద్య పరీక్షలు నిమిత్తం అనపర్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా నార్మల్ డెలివరీ అయ్యే అవకాశాలు లేవని చెప్పిన వైద్యులు సిజేరియన్ చేయాల్సి రావొచ్చని ఆరోగ్యశ్రీ కార్డు తెచ్చుకోమన్నారు. అయితే ఆరోగ్యశ్రీ కార్డులో కనకలక్ష్మి పేరు లేదు. ఆరోగ్యశ్రీ లేకపోతే సిజేరియన్‌కు రూ.వేలల్లో ఖర్చు అవుతుందన్నారు. ఆ సమయంలో వలంటీర్ సత్యవతికి ఫోన్ చేసి పరిస్థితి వివరిస్తే ఆధార్ జిరాక్స్, గ్రూప్ ఫొటో సంబంధిత పత్రాలు వాట్సాప్ చేయమంటే పంపించింది. వాట్సాప్ చేసిన కేవలం పది నిమిషాల్లో నీకు ఆరోగ్యశ్రీ కార్డు మంజూరైందని వలంటీర్ ఫోన్ చేసి చెప్పడంతో కనకలక్ష్మి ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. అరగంట లోపే ఆరోగ్యశ్రీ కార్డు జిరాక్సు కాపీని ఆమె చేతిలో పెట్టారు. దీంతో పైసా ఖర్చు లేకుండా నేను ప్రైవేటు ఆసుపత్రిలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది.

జీవితంలో మరువలేను



కూలి పనికి వెళితేగాని పూట గడవని పరిస్థితి నా తల్లిదండ్రులది. మా వలంటీర్ సత్యవతి ఆ సాయం చేయకపోతే మా పరిస్థితి ఏమిటన్న ఆలోచన నన్ను ఇప్పటికీ భయపెడుతూనే ఉంది. ఆమె సాయాన్ని జీవితంలో మరవలేను. ముఖ్యమంత్రి జగనన్న తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థకు వందనం.

– రొంగల కనకలక్ష్మి

వ్యక్తి అదృశ్యం

కంబాలచెరువు: లాలా చెరువు ప్రాంతానికి చెందిన రాంబాబు (44) అదృశ్యంపై ప్రకాష్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. తన భర్త మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని సాయి ప్రియాంక పోలీసులకు ఫిర్యాదు ఇచ్చింది.